
# రుచి

## మహీధర రామశాస్త్రి




ఆ వీధిలో సర్వజ్ఞరావుని ఎరుగని వారెవరూ లేరు. అతని అసలు పేరు ఎవరికీ తెలీదు. అందరూ సర్వజ్ఞరావనే పిలుస్తారు. సర్వజ్ఞరావు రిటైరయేక రాజమండ్రిలో ఓ మేడ కట్టుకుని స్థిరపడి, భార్య భారతమ్మతో ఉంటున్నాడు. కూతురు, కొడుకు ఎవరి కాపురాలు వాళ్ళు చేసుకుంటూ దూరాన ఉంటున్నారు. పిల్లలు ఏడాదికోసారి వచ్చి చుట్టపు చూపుగా వారం పదిరోజులుండి ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోతారు. ఆర్థిక యిబ్బందులు లేని సంసారం కావడంతో ముసలిదంపతులు ఆనందంగా కాలక్షేపం చేస్తున్నారు.

సర్వజ్ఞరావు వీధి చివర్లో ఓ కాలేజి ఉంది. ఆ కాలేజీలో చదువుకుంటున్న రోహిణి సర్వజ్ఞరావు ఇంటికెదురుగా వున్న మేడ రెండో అంతస్తులో ఓ గదిలో ఉంటూంది. రోహిణి సన్నగా పొడుగ్గా అందంగా ఉంటుంది. కలుపుగోలు మనిషి. అందరితో సులువుగా కలిసిపోతుంది. గదిముందున్న ఖాళీ స్థలంలో తీరిగ్గా నిలబడి యింటిచుట్టూ వున్న కొబ్బరి చెట్లను అందంగా చూస్తూ గడిపేస్తుంది. ప్రహరీగోడకు దగ్గరగా ఎదిగింది ఓ కొబ్బరిచెట్టు. దానిమీద పరుగులు తీసే ఉడుతల్ని పట్టుకోబోతుంది రోహిణి. అవి దొరకవు. ఐనా రోహిణికి అదొక ఆట ! ఉడుత కనబడకపోతే, ఎదురుగా వున్న సర్వజ్ఞరావు అందమైన మేడను చూస్తూ నిలబడుతుంది. మేడపైనున్న నీళ్ళటాంక్‌నీ, ఆ ప్రక్కనే తీగల మీద గాలికెగురుతూ ఆరుతూన్న బట్టల్నీ, ఆ పైన నీలాకాశాన్నీ, అందులో అప్పుడప్పుడు గుంపులు గుంపులుగా ఎగిరిపోయే వెలుతురు పిట్టల్నీ చూసి పరవశించి పోతుంది. తరచు సర్వజ్ఞరావు సాయంత్రాలప్పుడు వాలు కుర్చీలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ కనబడుతూ ఉంటాడు. ఆకాశంలో చుక్కలు దట్టమయే వేళకు క్రిందకు దిగి వెళ్ళిపోతాడు సర్వజ్ఞరావు.

సర్వజ్ఞరావు కూడా ఎదురింటి పిట్టగోడ నానుకుని నిలబడే రోహిణిని చూసేడు. ఆమె లేత గులాబీ రంగు చీర అదే రంగు జాకెట్టు చూసి ఆమె కాలేజి విద్యార్థిని అని అర్థం చేసుకున్నాడు. కొబ్బరాకుల మాటున నిలబడిన ఆమె పురి విప్పుకున్న నెమలిలాగా వుందనుకున్నాడు. సర్వజ్ఞరావుకి అరవైయేళ్ళు నిండాయి. కొడుకు లండన్‌లోను కూతురు అమెరికాలోనూ ఉంటున్నారు. ఆరోగ్యవంతురాలయిన భార్య భారతమ్మతో పండు టాకు తాంబూల చర్వణం లాంటి కాపురాన్ని సాగిస్తున్నాడు సర్వజ్ఞరావు ! రోహిణిని చూసిన ప్రతిసారీ సర్వజ్ఞరావు మనసులో యిలా తలపోస్తాడు – 'నా వయసు ఓ ముప్పయి సంవత్సరాలు తగ్గిపోతే ఎంత బాగుండును!' అని.

అది జరిగే పని కాదు కదా !

సర్వజ్ఞరావు పుస్తకప్రియుడు – హాల్లో తూర్పుగోడకి పెద్ద అద్దాల అల్మారా కట్టించి, దానినిండా పుస్తకాలు నింపేడు. సాదా ప్రతుల కన్నా కాలికో బైండు పుస్తకాలు ఖరీదు ఎక్కువయినా వాటినే కొంటాడు. టైటిల్సు గోల్డు లెటర్స్‌యితే ఎంత డబ్బయినా కొనేస్తాడు. భార్య భారతమ్మకు యిదంతా ఓ పిచ్చి వ్యవహారంగా కనబడుతుంది. ఐనా యేమీ అనదు ! అలా అనకపోవడానికి ఓ కారణం ఉంది.

భారతమ్మకి టీ.వీలో చూపించే వంటలంటే వల్లమాలిన మోజు. డైరీలో రోజుకో కొత్త వంట తయారీ విధానాన్ని రాసుకుంటుంది. రోజుకో కొత్త వంటని తయారు చేసి యిరుగుపొరుగులకు రుచులు చూపిస్తూ ఆనందిస్తుంది. జీడిపప్పు ఆవకాయ, ద్రాక్షపళ్ళ పచ్చడి, లవంగాల చారు తయారుచేస్తూ రుచులు చూపిస్తూ మురిసిపోతుంది. ఈ ముచ్చట్లు సర్వజ్ఞరావుకి యిష్టం ఉండవు. అతగాడు రోజుకి రెండే రెండు ఇడ్డెన్లు తిని కాలక్షేపం చేస్తాడు మరి ! అతను అన్నం తిని ముప్పయి సంవత్సరాలయిందట! ఐనా మనిషి జబర్దస్తుగా ఎర్రగా బుర్రగా ఆకర్షణీయంగా కనిపిస్తాడు. దేవీ ఉపాసకునిలా నుదుట యింత కుంకుమ బొట్టు పెడతాడు. తెల్లలుంగీ, తెల్లలాల్చీలు భావకవిలా అవుపిస్తాడు. డబ్బుకి లోటు లేదు. కాబట్టి ఎవరి సరదాలు వారు యధేచ్ఛగా తీర్చుకుంటున్నారు.

ఓరోజు భారతమ్మ తను పెట్టిన ములక్కాడల ఆవకాయను అందరకూ మచ్చు చూపించి అనసూయమ్మకు కూడా చూపించాలనుకుని ఎదురింట్లోకి అడుగుపెట్టింది. లంచ్‌టైమ్‌లో యింటికొచ్చిన రోహిణి గేటు తీస్తూ – 'హాయ్ ఆంటీ!' అంటూ అనసూయమ్మను పలకరించింది.

'ఎవరీ పిల్ల?' అనడిగింది భారతమ్మ. అనసూయమ్మ రోహిణిని భారతమ్మకు పరిచయం చేసింది.

'మీ యిల్లు చాలా బాగుంటుంది ఆంటీ!' అంది రోహిణి.

'మా యింటికి రాకుండానే చూసినట్టు చెబుతున్నావే !'

'నా గదిలోంచి మీ యిల్లంతా నాకు కనిపిస్తుందిలెండి! అంకులు సాయంత్రాలు పడకుర్చీలో కూర్చుని చుక్కల్ని లెక్కిస్తూ ఉంటారు !'

'అబ్బో... చాలానే కనుక్కున్నావు ! సరే ... మా అమ్మాయి లాంటిదానివి ! ఎప్పుడేనా వస్తూండు.'

— — —

ఓనాడు సాయంత్రం ఆరుగంటల సమయం. రోహిణి సర్వజ్ఞరావు యింటిగేటు తెరుచుకుని లోపలకి ప్రవేశిస్తూ –

'హాయ్ ! ఆంటీ ! ఏం చేస్తున్నారు?' అంటూ హాలు దాటి వంటింట్లోకి వస్తూ – 'మీ వంట ఘుమఘుమలు వీధిలోకంటా వస్తున్నాయి ! ఏం వండుతున్నారేవిటి?'

'గుండచారు ! రుచి చూస్తావా?' అంటూ భారతమ్మ ఓ గరిటెడు చారు గ్లాసులో పోసి టేబులు

మీద పెట్టింది. రోహిణి కుర్చీ లాక్కుని చారుగ్లాసుకి ఎదురుగా కూర్చుంది.

'అంకులు డాబామీద ఒంటరిగా కూర్చుని చుక్కలు లెక్కిస్తున్నారు. మీ మధ్య మాటా మాటా కానీ వచ్చిందా?'

'అదేం కాదమ్మా ! ఆయనంతే. నాతో బాగానే ఉంటారు.'

'ఓహ్ ! అమోఘంగా ఉంది చారు. చాలా థాంక్సు. మా అమ్మ కూడా యింత బాగా పెట్టలేదు గుండచారు. ఈసారి మీ దగ్గర నేర్చుకుంటాను వస్తానాంటీ!'

తూర్పువైపు గోడనున్న అద్దాల బీరువా దానిలోని పుస్తకాల మీద రోహిణి దృష్టి పడింది.

'బాపురే ! ఎన్ని పుస్తకాలో ! ఇవన్నీ మీరు చదువుతారా?'

'నావి కావమ్మా ! నాకు టైముండదు, యింటిపని, టీ.వీ.తోనే సరిపోతుంది నాకు. ఆ పుస్తకాలు మీ అంకులువి!'

'అంకులు పుస్తక ప్రియులన్నమాట!' అంటూ పుస్తకాల దగ్గరగా వెళ్ళి –

'The Iliod - Homer, The dialogues of Plato, Aristotle's Ethics – అన్నీ చాలా గొప్ప పుస్తకాలు ఆంటీ ! అంకుల్ని మంచి చేసుకుని, యివన్నీ పట్టుకుపోయి నేను చదవాల్సిందేను !'

'ఆయనతో సంబంధం లేదు. నీకు కావాల్సిన పుస్తకాలు పట్టుకువెళ్ళు; చదివేక తెచ్చి యిచ్చెయ్యి!'

— — —

ఆదివారం కాలేజి లేకపోవడంతో రూములో కూర్చుని రోహిణి సర్వజ్ఞరావు యింటి నుంచి తెచ్చుకున్న జేమ్స్ జాయిస్ పుస్తకం – యులిసిస్ – ఆబగా చదువుతూ కూర్చుంది. ఆ పుస్తకం గురించి వినడమే కానీ చదవగల అవకాశం యింతవరకూ రోహిణికి దొరకలేదు. 'అర్థం చేసుకోవడం కష్టం' అంటే, ఏమో అంత కష్టమయిన భాష ఉంటుందను కుంది తను ! తీరా చూస్తే అర్థం కాని భాషయేమీ లేదు. చిట్టి పొట్టి వాక్యాలు – I met her in the park. In the dark. What a lark ! – లాంటివి! ఐతే కథా సమన్వయం కుదరకుండా ఉంది ! 'అంకుల్ని అడిగి తెలుసుకుంటాను' అనుకుని తృప్తి పడింది రోహిణి.

సాయంత్రం వేళ వన దేవతలా అలంక రించుకుని రోహిణి చొరవగా సర్వజ్ఞరావు యింటి గేటు తీసుకుని లోపలకు వంటింట్లోకి నడిచింది.

భారతమ్మ పోపు తిరగమోతలో నిమగ్ను రాలయి వుండడంతో, వెనకాలే నిలబడ్డ రోహిణిని గమనించలేదు.

'ఆంటీ ! రెండు నిముషాలుగా మీ వెనకాలే నిలబడ్డా మీరు గుర్తించలేదు. ఎవడేనా యిల్లు దోచేసినా యింతేనా?'

'దోచుకుపోవడానికి మా యింట ఏమున్నా యిలే పుస్తకాలు తప్ప ! అవి యిస్తామన్నా ఎవరూ పుచ్చుకోరు, ఎవత్తో నీలాంటిది తప్ప ! అప్పుడే తెచ్చాశావేం? చదివేశావా?'

'లేదాంటీ. కొన్ని సందేహాలుంటేను; అంకుల్ని అడుగుదామని వచ్చాను.'

'ఊ ! పైనున్నారు వెళ్ళు!'

'మీరంకుల్‌కి యేదో నసపెట్టి ఉంటారు. ఆయన పైకి పారిపోయేరు!'

'అదేం కాదులే... అదంతేలే.....'

'భార్యా భర్తలన్నాక యేవో ఉంటాయిలెండి!'

'మంచి అనుభవజ్ఞురాలిలా చెబుతున్నావే ! పెళ్ళయినా కాలేదు !'

'ఇల్లూ – ఇల్లాలు – చదివి తెలుసుకున్నా లెండి ఆ మాత్రం.'

'సరేలే... వెళ్ళు.... పైకి వెళ్ళు. మళ్ళీ ఆయన ఎటయినా వెళ్ళగలరు !'

'సరే ఆంటీ !' అంటూ రోహిణి మెట్లెక్కి డాబా మీదకు వచ్చింది.

సర్వజ్ఞరావు బిళ్వర మంగలునిలా ముస్తా బయి డాబామీద అటు యిటూ పచార్లు చేస్తున్నాడు.

'హాయ్ ! అంకుల్ ! మీ ఆరోగ్యరహస్యం ఏవిటి? మీ వయసుకి పదేళ్ళు తక్కువగా కనుపిస్తారు. ఆంటీ మీరు ఒకచోట కూర్చునుండగా నేను చూడలేదు. కారణం ఏవిటి?

'నా ఇంటర్వ్యూ తీసుకోవడానికి కానీ వచ్చేవా? చేతిలో ఆ పుస్తకం ఏవిటి?'

'మీదేను..... యులిసిస్ ! నాలుగు రోజులయి పట్టుకువెళ్ళేను. అన్వయకాఠిన్యంగా ఉంది. మరేమయినా వివరిస్తారేమోనని యిలా వచ్చాను !'

'నేను మద్రాసు వెళ్ళినప్పుడు శ్రీశ్రీని కలిశాను. మాట్లాడుతూ మాట్లాడుతూ లేచి లోపలకు వెళ్ళి 'యులిసిస్' తెచ్చి ఓ అరడజను పేరాలు గడగడా చదివి' ఏమేనా అర్థం అయిందా?' అనడిగాడు.

నేను అర్థాంగీకారంగా మౌనం వహించి తొండలా తలాడించాను.

మళ్ళా లోపలకు వెళ్ళి దాని 'కీ' తీసుకువచ్చి చదివి వినిపించి, దాన్ని అర్థం చేసుకోవాల్సిన పద్ధతి గురించి చెప్పుకొచ్చాడు. ఎందుకు చెబుతున్నానంటే – శ్రీశ్రీకే అర్థంకానిది నాకు లొంగుతుందా అని నీకు తెలియజేయడానికి ! మనం చేయాల్సింది చదవడమేను !'

'సరే వస్తానంకుల్!'

'బయల్దేరు... నాకూ ఓ సాహిత్యసభ ఉంది! నేనూ బయల్దేరాలి!'

రోహిణి మెట్లు దిగుతూంటే యేదో బరువు దించుకున్నట్టయింది సర్వజ్ఞరావుకి.

భారతమ్మకు 'బై' చెప్పి బయటపడుతుంటే, ఆవిడ అడిగింది.

'ఏ అమ్మా ! మీ అంకులు ఏవన్నారు?'

'శ్రీశ్రీ గారికే అర్థం గానిది మనకర్థమవు తుందా?!' అన్నారు.

'ఈయన శ్రీశ్రీగారినెప్పుడు కలిశారట?! ఏమో... కలిసే వుంటారులే... ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవర్ని కలుస్తున్నారో యేమో ఊ...! వెళ్ళిరా అమ్మా !'

మరోనాడు బుద్ధపూర్ణిమనాడు బయట తుంపర పడుతూంటే, రోహిణి గదిలో కూర్చుని మాస్టర్ ఈ.కె. వ్రాసిన 'మంద్రగీత' చదువుతూ కూర్చుంది. నాలుగయిదు చోట్ల ప్లాస్టిక్ చాకుతో పేజీలను కోసి విడదీసి చదువుకోవాల్సి వచ్చింది.

సర్వజ్ఞరావు రోహిణికి ఆ పుస్తకాన్నిస్తూ –

'ఇది చదువు. ఇందులో సృష్టి – దాని వికాస రహస్యాన్ని చక్కగా తేటతెల్లము చేసారు మాస్టారు !' అన్న మాట గుర్తుకొచ్చి నవ్వుకుంది రోహిణి. ఆ నవ్వుకి అర్థం – అంటుకున్న పుటలు అంటుకున్నట్టే ఉండగా మొత్తం గ్రంథం చదివేసినంత ధీమాగా అంకులు ఎలా చెప్పారా?- అని.

ఆమాటే అడిగింది రోహిణి భారతమ్మను. భారతమ్మ తాను చేసిన వేడి వేడి క్యాబేజి పకోడీలను రుచి చూపించేందుకు అనసూయమ్మ యింటికి వచ్చింది. గేటు దాటుతున్న భారతమ్మను, ఆవిడ చేతిలోని బాక్సును చూసిన రోహిణి క్రిందకు దిగి వచ్చింది. క్యాబేజీ పకోడీలను ప్రశంసిస్తూ రోహిణి తన సందేహాన్ని బయటపెట్టింది.

'నీకింకా అర్థం కాలేదా? మీ అంకుల్‌కి చాలా సరదాలే ఉన్నాయి. అందమయిన పుస్తకాలని కొని ఎదురుగా పెట్టుకోవడం, అందమైన ఆడవాళ్ళతో స్నేహాలు పెంచుకోవడం, తానొక మేధావిగా సంఘంలో చెలామణి కావాలనుకోవడం.... యిలా! తన సరదాల పట్ల చాలా శ్రద్ధగా ఉంటారు !'

భారతమ్మకు వివరించక తప్పలేదు.

'ఏవిటో.... మనిషికో పిచ్చి ! ఒక్క పుస్తకం కూడా కొనకుండా, కనపడ్డ పుస్తకాలన్నీ అరువు తెచ్చుకుని చదవడం నాకున్న పిచ్చి !' అంది రోహిణి.

'తను తయారుచేసిన క్రొత్త వంటకాల రుచులు చూపించుకోవడం మా భారతమ్మకున్న పిచ్చి!' అంది అనసూయమ్మ నవ్వుతూ.

'ఇది ఆహ్వానించతగ్గ పిచ్చే లెండి !' అంటూ మెచ్చుకోలుగా భారతమ్మ మొహంలోకి చూసింది రోహిణి.